

## గ్రామాల్లో అయోధ్య అక్షింతల ఊరేగింపు

భైంసారూరల్, జనవరి 7: మండలంలోని ఇలేగాం, గుండేగాం గ్రామాల్లో అయోధ్య రాములోరి అక్షింతల ఊరేగింపు కార్యక్రమం ఆదివారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. చిన్నారులు జానకి, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రతీ ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. శ్రీరామ నామస్మరణ మార్మోగింది. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ముగ్గులతో నిండిన హరిహరక్షేత్రం ఆలయ ఆవరణ



ముగ్గులను పరిశీలిస్తున్న ఆలయ ధర్మకర్త అల్లోల మురళీధర్‌రెడ్డి



మొదటి బహుమతిని అందుకుంటున్న లక్ష్మీ శ్రీనివాస్



బహుమతులు అందుకుంటున్న లోగోలు వేసిన యువతులు

# రంగవల్లులతో.. పులకించిన పుడమి

- నిర్మల్‌లో ఆకట్టుకున్న 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన మహిళలు
- రంగులమయమైన హరిహరక్షేత్ర ప్రాంగణం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ఆంధ్రజ్యోతి చేస్తున్న కృషికి పలువురి మన్ననలు



మొదటి బహుమతి సాధించిన ముగ్గు ఇదే..



రెండో బహుమతి సాధించిన ముగ్గు ఇదే..



ముగ్గులో రంగులద్దుతున్న చిన్నారి



నిర్మల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భువిపై విరిసిన రంగుల హరివిల్లులా నిర్మల్ జిల్లాకేంద్రంలోని హరిహరక్షేత్రం మల్లన్నగుట్ట ప్రాంగణం దర్శనమిచ్చింది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున యువతులు, మహిళలు హరిహరక్షేత్రం మల్లన్నగుట్ట ఆలయ ప్రాంగణానికి తరలివచ్చి వారి ప్రతిభను కనబర్చారు. హరిహరక్షేత్ర ఆలయ ధర్మకర్తలు, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల వినోదమ్మ మురళీధర్ రెడ్డిల ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలకు పూర్తి ఏర్పాట్లుచేశారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలు వేసిన ముత్యాల ముగ్గులు అక్కడికి వచ్చిన చూపరులను ఆకట్టుకున్నాయి. ఈపోటీల్లో 165 మంది మహిళలు పాల్గొని ముగ్గులను వేసి రంగులతో అలంకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ మురళీధర్‌రెడ్డిలు హాజరు కాగా, అతిథిగా డాక్టర్ అఖిలారెడ్డి హాజరయ్యారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే ఈ ముగ్గుల పోటీ పట్ల పలువురు వక్తలు 'ఆంధ్రజ్యోతి'ని కొనియాడారు. అంతరించిపోతున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే గొప్ప లక్ష్యంతో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శనీయంగా ఉన్నాయంటూ అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో మహిళలు వేసిన రంగవల్లులను పరిశీలించేందుకు న్యాయనిర్ణేతలుగా నిర్మల్ పట్టణానికి చెందిన ఎట్టేం రజిత, పాకాల గీతారాణి, కె.అనితారాణి వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఖానాపూర్‌కు చెందిన మూడో వార్డు కౌన్సిలర్ జన్నారపు విజయలక్ష్మి సైతం 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. గతంలో నిర్వహించిన పోటీల్లో సైతం పలుమార్లు పాల్గొన్నానని 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలను ఆమె సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా అభివర్ణించారు. ఆలయ గురుస్వామి నవయుగమూర్తి, కోశాధికారి సామల వేణుగోపాల్‌లు ముత్యాల ముగ్గుల పోటీల నిర్వహణ కోసం ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్‌రిపోర్టర్ కొండూరి రవీందర్‌తోపాటు పలువురు రిపోర్టర్లు పాల్గొన్నారు.

### ఈ ముగ్గుల పోటీల్లో విజేతలు వీరే..

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో భైంసా పట్టణానికి చెందిన ధర్మవరపు లక్ష్మీశ్రీనివాస్ మొదటి బహుమతిగా గెలుపొందగా, ఖానాపూర్ పట్టణానికి చెందిన జన్నారపు సునీత రెండో బహుమతిగా గెలుపొందారు. ముథోల్‌కు చెందిన వేద్‌పాఠక్ దీపాళి తృతీయ బహుమతి గెలుపొందారు. మొదటి బహుమతిగా గెలుపొందిన విజేతకు రూ.6వేలు, రెండో బహుమతిగా గెలుపొందిన విజేతకు రూ.4వేలు, తృతీయ బహుమతి గెలుపొందిన విజేతకు రూ.3వేల నగదు ప్రోత్సాహకాన్ని 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో అందించారు. వీరితోపాటు ముథోల్‌కు చెందిన శివానీ, భైంసాకు చెందిన కల్యాణీ, నిర్మల్‌కు చెందిన జి.శ్రీజలకు కన్సోలేషన్ బహుమతులను అందించారు. ఈ పోటీల స్పాన్సర్ లోగోలైన కెనరా బ్యాంకు లోగోను నిర్మల్‌కు చెందిన ఎ. రిషిత, 'ఆంధ్రజ్యోతి' ఏబీఎన్ లోగోను ఖానాపూర్‌కు చెందిన బక్కశెట్టి ఉహారాణి, ఎయిమ్స్ విద్యాసంస్థలకు సంబంధించిన లోగోను ఖానాపూర్‌కు చెందిన గాండ్ల శ్రీనిధి, స్వర్గసీమ సుకేతనకు సంబంధించిన లోగోను నిర్మల్‌కు చెందిన వి. శివానీ వేశారు. వీరికిప్రత్యేక బహుమతులిచ్చారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్మల్ పట్టణంలోని భాగ్యనగర్‌కాలనీకి చెందిన స్వరూపిణీ నృత్య కళా క్షేత్రానికి చెందిన 14 మంది చిన్నారులు సాంస్కృతిక నృత్యాలతో అలరించారు.





సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న చిన్నారులు

చిన్నారులను సన్మానిస్తున్న దృశ్యం



### మొదటి బహుమతి దక్కడం ఆనందంగా ఉంది



- ధర్మవరపు లక్ష్మి శ్రీనివాస్, భైంసా (మొదటి బహుమతి విజేత)

మొదటిసారి ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొన్న నాకు మొదటి బహుమతి దక్కడం ఆనందంగా ఉంది. అందుకే బహుమతి స్వీకరించే సమయంతో భావోద్వేగానికి లోనయ్యా. సంస్కృతి, సంప్రదాయాలకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' పెద్దపీట వేయడం బాగుంది.

### మహిళలను ప్రోత్సహించే పోటీలు బాగున్నాయ్



- జన్నారపు సునీత, ఖానాపూర్, రెండో బహుమతి విజేత

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' మహిళలను ప్రోత్సాహించేందుకు ముగ్గుల పోటీలను నిర్వహించడం బాగుంది. గతంలో సైతం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో నేను పాల్గొన్నా. ఈ ఏడాది నాకు రెండోసారికి రెండో బహుమతి దక్కడం సంతోషకరంగా ఉంది.

### రెండోసారి బహుమతి సంతోషంగా ఉంది



- వేద్‌పాఠక్ దీపాళి, ముథోల్, మూడో బహుమతి విజేత

గత ఏడాది 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముగ్గుల పోటీల్లో రెండో బహుమతి సాధించిన నాకు ఈ ఏడాది కూడా మూడో బహుమతి రావడం ఆనందంగా ఉంది. రెండేళ్లుగా ముగ్గుల పోటీల్లో బహుమతులు దక్కడం మరిచిపోలేని అనుభూతినిస్తోంది.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క

## జిల్లా ఉపాధ్యాయురాలికి సావిత్రిబాయి పూలే అవార్డు

- అందజేసిన మంత్రి సీతక్క

నిర్మల్ కల్చరల్, జనవరి 7: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం సిర్గాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు బి.సుశీల ఆదివారం రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా సావిత్రిబాయి పూలే రాష్ట్ర అవార్డును అందుకున్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుశీలను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు, మాజీ ఎమ్మెల్సీ మారంపల్లి సూర్యనారాయణ, రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కొంగల వెంకటి, నాయకుడు భీమన్న పాల్గొన్నారు.

## చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలి

భైంసా, జనవరి 7: విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం చదువుతోపాటు ఆటల్లోనూ రాణించి అగ్రగాములుగా ఎదగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచించారు. ఆదివారం భైంసా కిసాన్‌గల్లీ శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. నేటి పోటీతత్వ యుగంలో ధీటుగా రాణించేందుకు విద్యార్థులందరూ పాఠశాల స్థాయి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలనిఅన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భైంసా టౌన్ సీఐ ఎల్.శ్రీను, విభాగ్ అధ్యక్షుడు డా. దామోదర్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షులు డా.నగేష్, బీజేపీ ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, సాంఫ్లీ రమేష్, తూమోల్ల దత్తుతో పాటు పాఠశాల ప్రబంధకారిణి ప్రతినిధులు, రెండు జిల్లాల క్రీడాకారులు, తదితరులు తల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

### విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బంగారు బాటలు వేయాలి

ఉపాధ్యాయులు ఉత్తమ విద్యాబోధన ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బంగారు బాటలు వేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎస్టీయూ క్యాలెండర్‌ను అవిష్కరించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు అందరం అంకితభావం పాటుపడదామని సూచించారు. ఉపాధ్యాయ లోకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎస్టీయూ అనిర్వచనీయంగా సేవలు అందిస్తోందని కొనియాడారు.ఇందులో ఎస్టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎస్ భూమన్న యాదవ్, జె. లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాంపల్లి నాగభూషణ్‌తో పాటు ముథోల్ నియోజక వర్గ పరిధిలోని ఆయా మండలాల యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు, బీజేపీ ప్రతినిధులు సోలంకే భీంరావ్, తూమోల్ల దత్తు, మధుకర్ పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

## కరాటేలో ముగ్గురికి బంగారు పతకాలు

భైంసా, జనవరి 7: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో భైంసాకు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తా చాటి బంగారు పతకాలు సాధించారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్ గ్రీన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం విక్టరీ శోటోకాన్ కరాటే వారి ఆధ్వర్యంలో మెమోరియల్ ఆఫ్ ఇండియన్ ఫ్రీడమ్ ఫైటర్ 16వ జాతీయ స్థాయి ఆల్ స్టైల్ ఓపెన్ చాంపీయన్ షిప్ పోటీలు జరిగాయి. ఇందులో భైంసాలోని అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు, ఒకరు కాంస్య పతకాన్ని సాధించారు. పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి కేదార్నాత్, మూడవ తరగతి విద్యార్థులు సయ్యద్ తోసిఫ్, అఫ్జలుద్దీన్‌లు బంగారు పతకాలు సాధించగా 6వ తరగతి విద్యార్థి దశరథ్ కాంస్య పతకాన్ని సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్ రెడ్డి అభినందించి జ్ఞాపికలు బహూకరించారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

## విద్యా, వైద్యం అందించేందుకు ఎల్లవేళలా కృషి : ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జనవరి 7: బోథ్ నియోజకవర్గంలో విద్యా, వైద్యం, రవాణా అందించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద బుగ్గారం గ్రామానికి 88 లక్షలు డిఎంఎఫ్‌టి నిధులతో తారురోడ్డు మంజూరు కాగా ఆయన భూమి పూజ చేసి పనును ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతు ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేగా బాధ్యతలను చెపట్టి నెల రోజులు మాత్రమే అవుతుందని నేల రోజుల్లోనే నియోజక వర్గంలో రూ. 30కోట్లతో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. బోథ్ నియోజక వర్గంలో విద్యా, వైద్యం, రవాణా అందించేందుకు ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం పెద్ద బుగ్గారం గ్రామంలోగల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ బాలికల పాఠశాల, కళాశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థినిలతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గురుకులంలో ఎసమస్య ఉన్న తనను సంప్రదించాలన్నారు. త్వరలోనే గురుకులంలో నెలకొన్న కొన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చెస్తానని అన్నారు. ఆయన వెంట నేరడిగొండ, బోథ్ ఎంపిపిలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, సర్పంచ్ రేణుకబాయి, నాయకులు రవిందర్‌రెడ్డి, దెవెందర్ రెడ్డి, జహీర్, నానక్‌సింగ్, ప్రతాప్‌సింగ్, కృష్ణ నాయక్, వసంత్‌రావు, హమ్యానాయక్, అంబారావు, సురేందర్, పండరి, పెంట వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్

## ఆన్‌లైన్‌లోకి ప్రజాపాలన దరఖాస్తులు

బజార్‌హత్నూర్, జనవరి 7: ఈ నెల ఆరు వరకు స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులు సోమవారం నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరుస్తున్నారు. మండలం పరిధిలోని ముప్పై గ్రామపంచాయతీల పరిధిలో ఉన్నా అన్ని గ్రామాల ప్రజలు ప్రభుత్వం ఇస్తున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్హత ఉన్న పథకాలకు అప్లై చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వెంటనే అన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా సోమవారం నుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు పూర్తి చేయాలని అధికారులు ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శులు ఆయా గ్రామ పంచాయతీలలో ఆన్‌లైన్ నమోదును ప్రారంభించారు. ఎంపీడీ రాథోడ్ రాధ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు వివరాలను నమోదు చేస్తున్నారు.

## 'పత్తి కొనుగోళ్ల నిలిపివేత'

సిరికొండ, జనవరి 7: ఇచ్చోడ మార్కెట్ కమిటీ పరిధిలోని ఇచ్చోడ, మన్నూర్ జిన్నింగ్‌లలో సోమ, మంగళవారాల్లో సీసీఐ వారు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఇప్పటికే మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన పత్తి నిండుగా ఉండడంతో రెండు రోజులపాటు కొనుగోళ్ళను నిలిపివేస్తున్నామని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

## ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

తాంసి, జనవరి 7: ప్రజా సమస్యల పరిష్కారాన్ని ఎజెండగా ఎంచుకొని అవిశ్రాంత పోరాటం చేస్తున్న ఘనత భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కే దక్కుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం తాంసి మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రజెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సట్వాజి, రేండ్ల రతన్ లతో పాటు నగరం అశోక్, జింక సతీష్, తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో ఎర్ర జెండాను ఎగురవేస్తున్న సీపీఐ నాయకులు

## ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

మావల, జనవరి 7: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు వ్యక్తులపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం జందపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టామన్నారు. అదే విధంగా హెల్మెట్ సరైన వాహన పత్రాలు నిబంధనలు పాటించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు జరిమాన విధించామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో ఎస్సైలు సయ్యద్ ముజాహిద్, గోవింద్, కానిస్టేబుల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గాండ్ల ఆత్మీయ సమ్మేళన సభ

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 7: అఖిల గాండ్ల తేలికుల సంఘం జిల్లా ఆత్మీయ సమ్మేళన సభ వైభవంగా జరిగింది. ఆదిలాబాదులోని ఎస్టీయు భవనంలో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎం°సోయం బాపు రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లు ముఖ్య అతితులుగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కుల చిహ్నామైన గానుగు, మొద్దుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నూతనంగ ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపాల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, దుర్గం శేఖర్, గాండ్ల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు అమనగంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

# 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు



మహిళలు వేసిన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి లోగో



మహిళలు వేసిన కెనరా బ్యాంకు లోగో


ఆదిలాబాద్‌లో ద్వితీయ బహుమతి విజేత పోలావార్ స్వాతికి నగదును అందిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు


ముగ్గులు వేయడానికి తరలివస్తున్న యువతులు



నిర్మల్‌లో విజేతలను ప్రకటిస్తున్న న్యాయ నిర్ణేత


నిర్మల్‌లో ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు


ఆదిలాబాద్‌లో కన్సోలేషన్ బహుమతులను అందిస్తున్న దృశ్యం



## విభాగ్ స్థాయి ఖేల్‌ఖూద్‌లో విద్యార్థుల ప్రతిభ

ముథోల్, జనవరి 7 : భైంసా కిసాన్ గల్లీ శ్రీ సరస్వతి శిశు మందిర్ కేంద్రంగా జరిగిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి ఖేల్ ఖుద్‌లో ముథోల్ మండల కేంద్రానికి చెందిన శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలవర్గ, కిషోర్ వర్గ స్థాయిలలో పాల్గొని మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు ప్రధాచార్యులు సారథి రాజు తెలియజేశారు. 3000ల మీటర్ల పరుగు పందెంలో శుభాంగి, 600ల మీటర్ల పరుగు పందెంలో యోగిత, 200ల మీటర్ల పరుగు పందెంలో లక్ష్మి ప్రసన్న, త్రికూద్ ఆటంకాల పరుగు పందెంలో ప్రత్యూష, రిలే పరుగు పందెంలో గంగాసాగర్, హైజంప్‌లో సారిక ప్రథమ స్థానంలో నిలిచి ప్రాంత స్థాయికి ఎంపికయ్యారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రబంధ కారిణి, సమితి సభ్యులు, ప్రధానాచార్యులు, ఆచార్యులు, విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.


రాష్ట్ర స్థాయికి ఎంపికైన సరస్వతి శిశు మందిర్ విద్యార్థులు

## రిమ్స్ ఆసుపత్రిలో అన్నిరకాల చికిత్సలు

● అధునాతన సౌకర్యాలను ప్రారంభించిన ఎంపీ సోయం

ఆదిలాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లోని సూపర్ స్పెషాలిటి హస్పిటల్‌లో కిడ్నీలో రాళ్లను శస్త్ర చికిత్స లేకుండా లేజర్ టెక్నాలజీతో రాళ్లను తొలిగించే మిషిన్‌ను ఎంపీ సోయంబాపురావ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ప్రారంభించారు.

● అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీ సోయంబాపురావ్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లోని రిమ్స్ హస్పిటల్‌లో అన్ని రకాల చికిత్సలు అందుతున్నాయని, ముఖ్యంగా కిడ్నీ సంబంధిత రాళ్ల సమస్య ఈ మధ్య కాలంలో ఎక్కువయింది. ఈ సమస్యతో బాధపడుతున్న వాళ్ళు చాలా మటుకు నాటు వైద్యానికి ప్రాధాన్యతను ఇస్తారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆపరేషన్ లేకుండా లేజర్ టెక్నాలజీ ద్వారా కిడ్నీ రాళ్లను తొలిగించే మెషిన్ ప్రారంభమైంది. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

● మరిన్ని సేవలు అందుబాటులోకి తెస్తా..

పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వస్థ్ సర్వేక్షన్ అభియాన్ పథకం కింద 150 కోట్ల రూపాయలతో సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిని నిర్మించి గత ప్రభుత్వానికి ఇచ్చారు. కానీ గత ప్రభుత్వం ఈ ఆసుపత్రిని నిర్వహించడంలో పూర్తిగా విఫలమైంది. తమ పేరు కోసం గొప్పలు చెప్పుకోవడానికి నామమాత్రంగా ఈ ఆసుపత్రిని ప్రారంభించి వదిలేసింది. ప్రస్తుత ప్రభుత్వంతో మరియు వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నేను స్వయంగా మాట్లాడుతున్నాను. ఈ ఆసుపత్రికి కావల్సిన పూర్తి స్థాయి డాక్టర్లను నియమించే ఏర్పాటు చేస్తానని అన్నారు. కిడ్నీకి సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు ఈ మధ్య కాలంలో పెరిగిపోయారు. వారికి మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడి కావాల్సిన ఏర్పాట్లు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కిడ్నీ రాళ్లను తొలిగించే మెషిన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

## వైభవంగా కుల దేవతల ఉత్సవాలు

● పోలుగూడలో జుగ్నాక్ వంశీయుల సమావేశం

ఇంద్రవెల్లి, జనవరి 7: పుష్యమాసంలో నిర్వహించే కుల దేవత (పెర్స పేన్) దేవత ఉత్సవాలను వైభవంగా నిర్వహిద్దామని జుగ్నాక్ వంశీయుల కుల దేవత ఉత్సవ నిర్వహకులు జుగ్నాక్ మహదు, జుగ్నాక్ జైతులు అన్నారు. ఆదివారం మండలంలోని వాల్గొండ గ్రామసంచాయతీ పరిధిలోని పోలుగూడ గ్రామంలో ఉమ్మడి జిల్లా సుగ్నాక్ వంశీయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పుష్యమాసం నిర్వహించే కుల దేవత ఉత్సవాలపై చర్చించారు. జుగ్నాక్ వంశీయులు తమ సొంత నిధులతో నిర్మాణ చేసిన సతీక్ దేవత అలయ ప్రారంభోత్సవం మే నెలలో నిర్వహించేందుకు నిర్ణయించారు. కులదేవత ఉత్సవాలు సతీక్ దేవత అలయ ప్రారంబోత్సవ పూజలు నిర్వహించడానికి ప్రతి కుటుంభం నుండి రూ.3వేల రూపాయలు విరాళాలు అందించాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్, ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావు, గ్రామస్తులు, ఆత్రం శంకర్, జుగ్నాక్ భరత్, జాలింరావు, మర్సుకోల నాందేవ్, జుగ్నాక్ కాశీరాం, కోరెంగా ఇంగుపటేల్, తదితరులున్నారు.


పోలుగూడలో సమావేశమైన ఉమ్మడి జిల్లా జుగ్నాక్ వంశీయులు

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

లోకేశ్వరం, జనవరి 7: మద్యానికి బానిసైన వ్యక్తి గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కుబీర్ మండలంలని పల్సి గ్రామానికి చెందిన కొంచెం గణేష్(40) గత తొమ్మిది నెలల క్రితం కూలీ పనుల కోసం కుటుంబంతో సహా లోకేశ్వరం మండలంలోని పొట్‌పెల్లి గ్రామానికి వచ్చి దొరికిన చోట కూలీ పని చేస్తూ జీవించేవాడు. కాగా గత కొద్ది కాలంగా మద్యానికి బానిసై కూలీ పనులకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండేవాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం భైంసా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునసట్లు ఎస్సై తెలిపారు.

## 'రెవెన్యూ డివిజన్ అంశాన్ని పరిశీలించండి'

బోథ్, జనవరి 7: బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఏఐసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ తుల అరుణ్‌కుమార్ రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించారు. హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వివరించారు.

## పురుగుల మందు తాగి యువరైతు మృతి

బోథ్, జనవరి 7: మండలంలోని బాదర గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసీ యువరైతు ఆత్రం భీమ్రావు (25) శనివారం రాత్రి పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబీకులు ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్ఐ బోఫుల రాము తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. బాదర గ్రామానికి చెందిన రైతు తనకున్న నాలుగు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. అయితే పంట దిగుబడి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకుల రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. .

## ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు

మావల, జనవరి 7: మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓ ప్రైవేట్ పాఠశాలలో బాలికపై తరచూ ప్రిన్సిపాల్ మోహన్ రావు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారన్నారు. తరచు బాలికతో అసభ్యకరమైన మాటలు,వెకిలి చేష్టలు చేయడం చేస్తూ వేధిస్తున్నాడన్నారు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు మావల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.3, కనిష్ఠం 14.2



## 'రేపు తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నికలు'

బోథ్, జనవరి 7: ఈనెల 9న మంగళవారం మండల కేంద్రంలోని సాధికారలో తుడుందెబ్బ మండల కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు డివిజన్ అధ్యక్షుడు ధ్రువ విశ్వేశ్వర్ తెలిపారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల నుంచి సర్పంచులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారితో పాటు మహిళలు అధికసంఖ్యలో తరలి రావాలని కోరారు. ఇందులో డివిజన్ ఉపాధ్యక్షుడు రాజన్న, జిల్లా ఉపాధ్య క్షుడు, సలహాదారు వందనం శంకర్, కొడప విజయ్, గూడెం ఉగాదిరావు, కనక అమృతరావు, గోపాల్, ఆయా గ్రామాల పటేళ్లు పాల్గొన్నారు.

# ఇలపై హరివిల్లు

## ... ఆకట్టుకున్న రంగవల్లులు


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

**'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన** కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాగిన ముత్యాల ముగ్గుల పోటీ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. జిల్లా నలుమూలల నుంచి మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిభింబించేలా వేసిన రంగవల్లులు.. ఇలపై హరివిల్లును తలపించాయి. కాగా, ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల శంకర్ ముగ్గులను తిలకించారు. యేటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తూ.. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్న 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'ని అభినందించారు.

- 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' ముగ్గుల పోటీకి విశేష స్పందన
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన మహిళలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువతులు, చిన్నారులు
- సామాజిక అంశాలే ఇతివృత్తంగా సాగిన కార్యక్రమం
- తిలకించిన ఎంపీ సోయం, ఎమ్మెల్యే పాయల
- మొదటి బహుమతి పొందిన జాదవ్ అశ్విని
- రెండు, మూడో బహుమతులను కైవసం చేసుకున్న పోలావార్ స్ఫూర్తి, టీ.రేణుక



మొదటి విజేత జాదవ్‌అశ్వినికి నగదును అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 7: 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలలో యువతులు, మహిళలు పాల్గొనేందుకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. సంక్రాంతి పండుగకు ముందే మహిళలు ముత్యాల ముగ్గులకు రంగులద్దిన వేళ వారి చేతి వేళ్లు కుంచలుగా మలిచి వేసిన రంగవళ్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీలకు మహిళలు, యువతులు ఉత్సాహంగా తరలిరావడంతో స్టేడియం ప్రాంగణమంతా సక్రాంతి పండుగ శోభను సంతరించుకుంది. మహిళల చేతిలో రకరకాల రంగవళ్లులు అందంగా రూపుదిద్దుకున్నాయి. అవి సంస్కృతీ, సంప్రదాయలకు ప్రతిబింబాలుగా.. సంక్రాంతి పండగను స్ఫురించే విధంగా చెరుకు గడలు, పెరుగుకుండలు. నవధ్యాన్యాలు, పూర్ణ కుంభాలు, కలషాలు, దేవతల ఆకృతులు, గొబ్బెమ్మలు, జాతీయ సమైక్యత ను చాటే ఆకృతులు, రంగులు ముగ్గుల రూపంలో కనువిందుచేశాయి. మహిళ మణులు తమ మనోబావాలకు దర్పణం పట్టేలా ముగ్గుల్లో దాగి ఉన్న శాస్త్రీయతను, సందేశాలను తెలిపారు. ఆనందంగా ఉత్సాహ భరితంగా సాగిన పోటీలతో మైదాన ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఉదయమే మహిళలు, యువతులు పోటీలు జరిగే ప్రదేశానికి చేరుకుని తమకు కేటాయించిన స్థలాన్ని ముస్తాబు చేసుకున్నారు. ముచ్చటైన ముగ్గులను రంగులతో ఆకర్షనీయంగా రూపుదిద్ది విజేతలుగా నిలిచా రు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఎంపీ సోయంబాపురావ్, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు హాజరయ్యారు. మహిళలు, యువతులు వేసిన రంగుల ముగ్గులను పరిశీలించి విజేతలను ప్రకటించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు అతిథుల చేతుల మీదుగా నగదు బహుమతులను, మెమోంటోలను ప్రదానం చేశారు.





### పోటీల్లో విజేతలు వీరే...

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలు.. జాదవ్ అశ్విని మొదటి బహుమతి దక్కించుకోగా స్ఫూర్తి పోలావార్ రెండవ బహుమతిని దక్కించుకుంది. తృతీయ బహుమతిని టి.రేణుక గెలుపొందారు. విజేతలను ముఖ్య అతిథులతో పాటు పలువురు మహిళలు అభినందించారు.

### బహుమతుల ప్రదానం

ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొని గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వజ్రమాల, జయశ్రీ, సువర్ణ, లలితలు వ్యవహరించారు. కాగా మొదటి బహుమతి జాదవ్ అశ్వి ని,రెండవ బ్యాహుమతి పోలేవార్ స్ఫూర్తి, మూడవ బహుమతి టి.రేణుకలు దక్కించున్నారు. అలాగే ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలు, యువతులకు కన్సలైన్సీ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ రాజేశ్వర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఇ.రవీందర్, ఆదిలాబాద్ అర్బన్ రిపోర్టర్ రాకేష్, మండల రిపోర్టర్లు మహేందర్, వెంకటేశ్, రఫీ, అశోక్, ఆంధ్రజ్యోతి యాడ్స్ ఇన్‌చార్జి రాజేశ్వర్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ముగ్గును వేస్తున్న మహిళ

మొదటి మూడు వరుస బహుమతులను సాధించిన ముగ్గులు

ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు,చిన్నారు



### రంగురంగుల ముగ్గులను చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది

● సోయం బాపురావు, ఎంపీ, ఆదిలాబాద్

మహిళలు ఎంతో అందంగా వేసిన రంగురంగుల ముగ్గులను చూస్తే ఆశ్యర్యం కలుగుతుంది. జిల్లాలోనూ ఇలాంటి ముగ్గులను వేయడం మాములు విషయం కాదు. కంప్యూటర్ మాదిరిగా రంగురంగు ముగ్గులను తీర్చిదిద్దిన మహిళలకు ప్రత్యేక అభినందనలు. 'ఆంధ్రజ్యోతి' ఈ ముగ్గుల పోటీలను నిర్వహించడం యేటా ప్రత్యేకతను సంతరించుకుంటుంది. మహిళలు ఈ సంప్రదాయాలను రాబోయే తరాలకు కూడా తెలిపేలా చూడాలి. మహిళల్లో దాగి ఉన్న కళానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన ముగ్గుల పోటీలు వేదికగా నిలుస్తాయి. మహిళలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నావంతు కృషి చేస్తాను.

### సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడడం గొప్ప విషయం

● పాయల శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

తెలుగుజాతి సంస్కృతి, సంప్రదాయాలను, అలాగే శాస్త్రీయతను రాబోయే తరాలకు అందించాలన్న ఉద్దేశంతో 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' చేస్తున్న కృషి ఎంతో గొప్ప విషయం. అంతేకాకుండా యేటా మహిళలకు ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతృప్తికరంగా ఉంది. మహిళల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు 'ఆంధ్రజ్యోతి' చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. మహిళలను ప్రోత్సహించే విధంగా ముగ్గుల పోటీలు ఎంతో దోహద పడుతాయి. ఈ సందర్భంగా మహిళలు, యువతులు వేసిన ముగ్గులు తెలుగు సంస్కృతికి అద్దం పట్టేలా ఉన్నాయి. ఈ ఘనత 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌కే దక్కుతుంది. ఇందుకు యజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

### గత 15 ఏళ్లు ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నా..

: జాదవ్ అశ్విని, మొదటి బహుమతి విజేత



గత 15 ఏళ్లగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' వారు నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నాను. ఈ సారి మొదటి బహుమతి దక్కడం సంతోషంగా ఉంది. చిన్నప్పుడు అమ్మను చూసి ముగ్గులు వేయడం నేర్చుకున్నాను. కానీ ఎక్కువగా డిజైన్ ముగ్గులు వేసేదాన్ని. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలలో చుక్కల ముగ్గులకే ప్రాధాన్యం ఉంటుందని తెలుసుకున్నా. నా గెలుపు వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉంది. 'ఆంధ్రజ్యోతి'కి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

### ముగ్గుల పోటీలలో పాల్గొనడం ఎంతో ఇష్టం

: స్ఫూర్తి పోలావార్, రెండవ బహుమతి విజేత



ప్రతియేటా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలలో పాల్గొనడం నాకెంతో ఇష్టం. భర్త ప్రోత్సాహంతో ప్రతియేటా ముగ్గుల పోటీలలో పాల్గొంటున్నా. ప్రతియేటా మొదటి బహుమతి వచ్చేది. కాని ఈ సారి మాత్రం రెండవ బహుమతి దక్కింది. అయిన నిరుత్సాహ పడకుండా వచ్చే యేడాది మొదటి బహుమతి కోసం ప్రయత్నం చేస్తా. గత పదేళ్లగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. చిన్న నాటి నుంచి ముగ్గులు వేయడమంటే చాలా ఇష్టం. ఓపికగా ముగ్గులు వేసేదాన్ని.

### బహుమతి రావడం ఆనందంగా ఉంది

: టి.రేణుక, తృతీయ బహుమతి



'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలలో బహుమతి రావడం ఎంతో ఆనందంగా ఉంది. మూడవ బహుమతి దక్కినా ఎంతో సంతోషంగా ఉంది. ఈసారి మొదటి ప్రయత్నంలోనే తృతీయ బహుమతి సాధించడం సంతృప్తికరంగా ఉంది. ఇన్నాళ్లు ఇంటి వద్ద సరదాగా ముగ్గులు వేసేదాన్ని. ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పోటీల్లో పాల్గొన్నాను. నన్ను గుర్తించి బహుమతి దక్కేలా చేసిన 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్'కి ప్రత్యేక ధన్యవాదాలు.


ఇంటింటా అక్షింతలను పంపిణీ చేస్తున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

## ఇంటింటికీ అయోధ్య రాముడి పూజిత అక్షింతల పంపిణీ

బోథ్, జనవరి 7: అయోధ్య నుంచి వచ్చిన రాముని పూజిత అక్షింతలను ఆదివారం విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులు పట్టి స్వాగతం పలకగా విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఇంటింటికి పూజిత అక్షింతలను పంపిణీ చేశారు. 22న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నాం ఒంటిగంట వరకు రామలయంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రత్యేక్షంగా టీవీలలో చూడాలని ఈ సందర్భంగా అక్షింతలను కుటుంబసభ్యుల తలపై వేసుకుని అశీర్వద అక్షింతలుగా భావించాలని సూచించారు. ఇంటి ముందు సాయంత్రం కనీసం ఐదు దీపాలను వెలిగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి పాలిక్ రమేష్, వడ్లకొండ శ్రీనివాస్, కట్కూరి సాయి, సూన రాము, కటకం శ్రీధర్, సతీష్, వేముల కిష్టయ్య జటాల శివ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రాయి దేవతకు ఆదివాసీల పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 7: ఆదివాసీల ఆరాధ్య దైవం ఇంద్రాయి దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయంలో ఉమ్మడి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని నార్నూర్, ఉట్నూర్, జైనూర్, ఆదిలాబాద్ మండలానికి చెందిన ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఇంద్రాయి ఆలయానికి తరలివచ్చారు. ఇంద్రాయి దేవతకు పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివాసీ గిరిజన వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అంతేకాకుండా కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాయి ఆలయ మహరాజ్ చహాకటి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



● భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం (ఇన్‌సెట్‌లో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం)


పడి పూజలో పూజలు చేస్తున్న స్వాములు

## ఘనంగా అయ్యప్ప మెట్ల పూజ

● అయ్యప్పకు అభిషే కం

తాంసి, జనవరి 7: మండల కేంద్రమైన తాంసిలో ఆదివారం మధ్యాహ్నాం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బట్టు కిష్టన్న దంపతులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చెందిన 40 మంది అయ్యప్ప స్వాములే కాకుండా ఆదిలాబాద్‌కు చెందిన పలువురు అయ్యప్ప స్వాములు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా గణపతికి అభిషేకం నిర్వహించిన అనంతరం సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామికి 18 పదార్థాలతో ప్రత్యేక అభిషేకాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా చివరకు 18 మెట్లు వెలిగించి పడిపూజను ముగించారు. పడిపూజలో గురు స్వాములు ఎల్మా గంగారెడ్డి, సోమ పోచారెడ్డి, నరేష్, శ్రీనివాస్, రాజన్న, పాల్గొన్నారు. తాంసికి చెందిన స్వామి రెడ్డి, ప్రేమలు పాడిన భక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం స్వాములకు భిక్షను ఏర్పాటు చేశారు.